ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 25-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

ముఖ్యాంశాలు

- స్థానిక భాషలలోకి భారత రాజ్యాంగం అందుబాటులోకి రావడం ముదావహమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
- క్రీడలతోనే యువత భవిష్యత్తు ఆధారపడి ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- మౌలిక సదుపాయాల రంగంలో భారతదేశం అగ్రస్థానానికి చేరుకుంటోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు.
- ఉత్తరప్రదేశ్ లో భారీ రక్షణ కారిడార్ ని నిర్మిస్తున్నామని ప్రధానమంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = =

స్థానిక భాషలలోకి భారత రాజ్యాంగం అందుబాటులోకి రావడం ముదావహమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో సంతాలీ భాషలో రాజ్యాంగాన్ని రాష్ట్రపతి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాజ్యాంగం ఇప్పుడు ఓల్ చికీ లిపిలో సంతాలీ భాషలో అందుబాటులోకి రావడం సంతాలీ ప్రజలందరికీ గర్వకారణమైన విషయమని అన్నారు. దీనివల్ల వారు తమ సొంత భాషలో రాజ్యాంగాన్ని చదివి, అర్థం చేసుకోగలుగుతారని ఆమె చెప్పారు. ఓల్ చికీ లిపి శతాబ్ది ఉత్సవాలను ఈ సంవత్సరం జరుపుకుంటున్నామని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్...22 సెకన్లు)

ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తదితరులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

విద్య సమాజాన్ని ఎంతగా ప్రభావితం చేస్తుందో తెలియజేసిన నాయకుడు పండిట్ మదన్ మోహన్ మాలవ్య అని ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ అన్నారు. 'మహామన వాఙ్మయం పేరుతో పండిట్ మదన్ మోహన్ మాలవ్య సంకలిత రచనల రెండవ చివరి సంపుటాలను న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ రచనలు కేవలం కాగితంపై సిరా అక్షరాలు మాత్రమే కాదని, భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన పూర్తి సమాచారమని అభివర్ణించారు. వలస పాలన కాలంలో దేశాన్ని మేల్కొలపడానికి విద్య శక్తివంతమైన సాధనమని పండిట్ మదన్ మోహన్ మాలవ్య విశ్వసించారని ఉప రాష్ట్రపతి చెప్పారు. శతాబ్దాల క్రితం పండిట్ మదన్ మోహన్ మాలవ్య ప్రతిపాదించిన నైతిక విలువలు ఇప్పుడు 2020 జాతీయ విద్యా విధానంలో పొందుపరచినట్లుగా రాధాకృష్ణన్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

క్రీడలతోనే యువత భవిష్యత్తు ఆధారపడి ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. దేశ భవిష్యత్తు సైతం క్రీడల మీద ఆధారపడి ఉందని ఆయన పేర్కొన్నారు. సంసద్ ఖేల్ మహోత్సవంలో పాల్గొన్న ప్రధానమంత్రి ఢిల్లీ

నుంచి దృశ్య మాధ్యమం ద్వారా ఈరోజు ప్రసంగిస్తూ, సంసద్ ఖేల్ మహోత్సవ్.. దేశానికి వేలాది మంది ప్రతిభావంతులైన క్రీడాకారులను అందిస్తోందని చెప్పారు. ఇటీవల కాలంలో సంసద్ ఖేల్ మహోత్సవం పరిధి, దాని ప్రభావం గణనీయంగా పెరిగాయని అన్నారు. యువత అభివృద్ధి ద్వారా దేశ నిర్మాణం అనే మంత్రంతో ఈ క్రీడా ఉత్సవం సాగుతోందని ఆయన తెలిపారు. ఈ క్రీడల ద్వారా క్రీడాకారులు నేర్చుకునే క్రీడాస్ఫూర్తి యువత అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్...32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

గత పదకొండేళ్ళలో ప్రపంచంలోనే భారత్ రెండవ అతిపెద్ద మొబైల్ ఫోన్ల తయారీ కేంద్రంగా మారిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. దేశంలో తయారు చేయబడిన అన్ని రకాలైన వస్తువులు ప్రపంచ మార్కెట్ ని చేరుకుంటున్నాయని అన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయీ 101వ జయంతి సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నోలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో భాగంగా జాతీయ స్మారకంగా రాష్ట్రీయ ప్రేరణా స్థల్ ని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉత్తరప్రదేశ్‌లో భారీ రక్షణ కారిడార్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం చూసిన బ్రహ్మోస్ క్షిపణి ఇప్పుడు లక్నోలో తయారు చేయబడుతోందని అన్నారు. అదే విధంగా దేశం కోసం సేవ చేసిన నాయకులను కూడా గుర్తిస్తున్నామని నరేంద్రమోదీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఆధునిక మౌలిక సదుపాయాల రంగాలలో భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టే ప్రయత్నం జరుగుతోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. గ్వాలియర్‌లో ఈరోజు నిర్వహించిన అభ్యుదయ మధ్యప్రదేశ్ సదస్సులో హోంమంత్రి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొబైల్ రక్షణ తయారీ వ్యవస్థలో భారత్ శక్తిని చాటుకుంటోందని గుర్తు చేశారు. భారతదేశం స్వావలంబన దిశగా అడుగులు వేస్తోందన్నారు. మధ్యప్రదేశ్ లో అభివృద్ధి పెద్ద ఎత్తున సాగుతోందని తెలిపారు. భౌగోళిక పరంగా అనుకూలత మధ్యప్రదేశ్ కి ఉన్న ప్రత్యేకతగా చెప్పారు. మధ్యప్రదేశ్‌లో దాదాపు 50 శాతం పైగా అంకుర పరిశ్రమలు మహిళలే నిర్వహిస్తున్నారని, మహిళా సాధికారతకు అది అసలైన ఉదాహరణ అని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్...30 సెకన్లు)

ఇదిలా ఉండగా.. దివంగత నాయకుడు, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్ పేయి దేశ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటమే కాకుండా మంచి పాలనను అందించారని అమిత్ షా గుర్తు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = =

క్రిస్మస్ స్ఫూర్తి.. సమాజంలో సామరస్యం, సద్భావనను ప్రేరేపిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని కేథడ్రల్ చర్చ్ ఆఫ్ ది రిడంప్షన్‌లో ఈరోజు జరిగిన క్రిస్మస్ ప్రార్థనలకు ప్రధానమంత్రి హాజరయ్యారు. అనంతరం ఆయన సామాజిక మాధ్యమం వేదికగా దేశ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, శాంతి కరుణకు సంబంధించిన కాలాతీత సందేశాన్ని క్రిస్మస్ అందిస్తుందని ఆయన చెప్పారు. యేసుక్రీస్తు బోధనలు సమాజంలో సామరస్యాన్ని బలోపేతం చేస్తాయని ప్రధానమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

మాజీ ప్రధానమంత్రి భారతరత్న, అటల్ బిహారీ వాజ్‌పేయి వ్యక్తిత్వం, కృషి , నాయకత్వం దేశ సర్వతోముఖాభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. వాజ్ పేయి తన

జీవితాంతం సుపరిపాలన దేశ నిర్మాణానికి అంకితమయ్యారని సామాజిక మాధ్యమం ద్వారా పెట్టిన పోస్టులో ఆయన కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = = =

భారతరత్న పండిట్ మదన్ మోహన్ మాలవ్య జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆయనకు ఈరోజు నివాళులర్పించారు. మదన్ మోహన్ మాలవ్య తన జీవితాన్ని మాతృభూమి సేవకే అంకితం చేశారని సామాజిక మధ్యమం ద్వారా పెట్టిన పోస్టులో ఆయన గుర్తు చేశారు. దేశ విద్యా రంగానికి పండిట్ మదన్ మోహన్ మాలవ్య చేసిన అసమాన సేవను ఎప్పటికీ మరువలేమని ప్రధానమంత్రి అన్నారు.
మదన్ మోహన్ మాలవ్య అవిశ్రాంత జ్ఞాన సాధన, సామాజిక సంస్కరణల పట్ల నిబద్ధత, ఆదర్శప్రాయమైన నైతిక నాయకత్వం అందరికీ స్ఫూర్తిదాయకమని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

తన బలమైన నాయకత్వం ద్వారా భారత రాజకీయాలను వాజ్ పేయి కొత్తగా దిశానిర్దేశం చేశారని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా చెప్పారు. మాజీ ప్రధానమంత్రి భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి, పండిట్ మదన్ మోహన్ మాలవ్య జయంతి సందర్భంగా న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. మీ నాయకుడి గురించి తెలుసుకోండి అన్న అంశంపైన ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. వాజ్ పేయి, మాలవ్య దేశానికి చేసిన సేవలను వివరించారు. ఈ ఇద్దరు నాయకులు దేశ ప్రజాస్వామ్య సాంస్కృతిక పునాదులను బలోపేతం చేశారని ఓం బిర్లా అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయి జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఢిల్లీలోని ఆయన సమాధి సదైవ్ అటల్ ని ఈరోజు సందర్శించి నివాళులు అర్పించారు. అదే విధంగా ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో జరిగిన ఒక కార్యక్రమంలో వాజ్‌పేయి చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =